మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 194
పేజీలు : 3

గురువారం 12.02.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## మెక్‌డొనాల్డ్స్ పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి




**టి మీడియా, ఫిబ్రవరి 11 ,జైపూర్ :**రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో ఉన్న ఓ మెక్‌డొనాల్డ్స్ హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రజల ఆరోగ్యాన్ని పక్కనపెట్టి నిబంధనలకు విరుద్ధంగా ఆహారాన్ని తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.తనిఖీల్లో బయటపడ్డవి:ఫ్రెంచ్ ఫ్రైస్ వంటివి వేయించడానికి వాడుతున్న నూనె చాలా నాసిరకంగా ఉందని తేలింది. సాధారణంగా నూనెలో ఉండాల్సిన నాణ్యత25% కంటే తక్కువ ఉండాలి. కానీ ఇక్కడ శాఖాహార వంటలకు 31%, మాంసాహార వంటలకు 28% ఉన్నట్లు గుర్తించారు.నూనె రంగు పూర్తిగా మారిపోయినా సరే, అలాగే వాడుతున్నారు. ఇలాంటి నూనె తింటే గుండె జబ్బులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీంతో అధికారులు సుమారు 40 లీటర్ల నూనెను అక్కడికక్కడే పారబోయించారుకుళ్ళిన టమోటాలు: కోల్డ్ స్టోరేజ్ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన దాదాపు 40 కిలోల కుళ్ళిన టమోటాలను అధికారులు గుర్తించి వాటినిపారవేశారు.అపరిశుభ్ర వాతావరణంలో ఆహారం తయారు చేస్తున్నందుకు హోటల్ మేనేజర్‌కు అధికారులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపారు. రిపోర్ట్ వచ్చిన తర్వాత మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# ప్రశాంతంగా ముగిసిన "పుర"పోలింగ్

## 13న కౌంటింగ్‌కు ఏర్పాట్లు







- కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఓటు
- రంగారెడ్డి ,మిర్యాలగూడలో ఉద్రిక్తత లు

**టీ మీడియా ,ఫిబ్రవరి 11, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ రాష్ట్రంలో పుర, నగరపాలక ఎన్నికల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,981 వార్డుల్లో పోలింగ్ నిర్వహించగా అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్?లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్? చేరుకుని, శంషాబాద్ నుంచి దిల్లీకి బయలుదేరారు. ఖమ్మం జిల్లా మధిరలోని 9వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. నాయకులు, యువత, వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనావేస్తున్నారు. ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

### ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు నిర్వహించిన ఎన్నికలు చెదురుమదురు ఘటనల మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులను ఎస్?ఈసీ ఏర్పాటు చేసింది. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు 2,582 వార్డుల్లో కౌన్సిలర్ల ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే తొమ్మిది పురపాలికల్లోని 12 వార్డుల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాల్టీలోని ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. అన్ని మున్సిపాల్టీల్లో కలిపి 10,719 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పుర ఎన్నికలకు సంబంధించి 6,017 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

### 21174 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు

రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లకు ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 414 వార్డులకు గాను రెండుచోట్ల ఏకగ్రీవం కావడంతో 412 డివిజన్లలో ఎన్నికల కోసం 21,174 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లలో 2,225 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ 410, బీఆర్ఎస్ 401, బీజేపీ 382 అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఆమ్‌ఆద్మీ పార్టీ 12, బీఎస్పీ 44, సీపీఎం 10, ఎంఐఎం 62, ఫార్వర్డ్ బ్లాక్ 122, సీపీఐ 65, జనసేన 81, ఇతర పార్టీలు 55 స్థానాల్లో పోటీ చేయగా 578 మంది ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలోని ఒక్కో వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో కలిపి 52 లక్షల 17వేల 413 మంది ఓటర్లు ఉన్నారు.

వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ పర్యవేక్షించిన ఈసీ

రాష్ట్రంలోని 8,191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎవ్వటికవ్పుడు వర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే గురువారం నిర్వహించనున్నట్లుగా తెలిసింది. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 136 కేంద్రాల్లో ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఈనెల 16వ తేదీన మున్సిపాల్టీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్? కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

పలుచోట్ల స్వల్ప ఘర్షణలు


మిగతా 3లో..


# నేడు భారత్ బంద్



- పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు
- 30కోట్ల మంది పాల్గొనే ఛాన్స్

**టీ మీడియా ఫిబ్రవరి 11,ఢిల్లీ బ్యూరో :** కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న విధానాలకు నిరసిస్తూ రైతు సంఘాలతో పాటు అనేక కార్మిక సంఘాలు గురువారం (ఫిబ్రవరి 12) భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జరిగే దేశవ్యాప్త సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా. ఈ భారత్ బంద్ వల్ల బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలు, రవాణా సేవలు ప్రభావితం అయ్యే ఛాన్స్ ఉంది.

### బంద్‌కు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు

భారత్ బంద్‌కు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ , ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ , ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ , హింద్ మజ్దూర్ సభ, అనేక ఇతర ప్రధాన కార్మిక సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. భారత్-అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా , ఇతర రైతు సంఘాలు కూడా బంద్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. ఈ ట్రేడ్ డీల్ ప్రకారం అమెరికా ఉత్పత్తులు చౌకగా భారత్ మార్కెట్లలోకి వస్తాయని, దీంతో మనదేశంలోని అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అలాగే వామపక్ష పార్టీలు, తమిళనాడుకు చెందిన వీసీకే (విదుతలై చిరుతైగల్ కట్చి), డీఎంకే వంటి రాజకీయ పార్టీలు కూడా భారత్ బంద్‌కు సంఘీభావం ప్రకటించాయి. ఈ బంద్‌లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరాయి.

కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా

సమ్మె కేవలం భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి మాత్రమే కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాల గురించి కూడా అని యూనియన్ నాయకులు తెలిపారు. నాలుగు కొత్త కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, అవి కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు. విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఎంజీనరేగా స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, కార్పొరేట్ అనుకూల సంస్కరణలను తీసుకురావొచ్చని డిమాండ్ చేస్తున్నారు.

బంద్ ప్రభావం ఎంత?

భారత్ బంద్ నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో బస్సులు, ఆటోలు, ట్రక్కులు సహా


మిగతా 3లో..


## జీహెచ్ఎంసీ విభజనకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

### మూడు కార్పొరేషన్లు విభజిస్తూ జీవో రిలీజ్




**టి మీడియా, ఫిబ్రవరి 11 , హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగర పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత జీహెచ్ఎంసీ పరిధిలోని కోర్ అర్బన్ ఏరియాను పునర్విభజించి మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్పొరేషన్ యథావిధిగా కొనసాగనుండగా, కొత్తగా సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లను ఏర్పాటు చేశారు. కూకట్పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లను కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపొందించారు. ఐటీ, అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల పరిపాలనను మరింత సమగ్రంగా నిర్వహించేందుకు ఈ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం చెబుతోంది.అలాగే ఎల్బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్లను కలిపి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. వేగంగా విస్తరిస్తున్న నివాస ప్రాంతాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లతో జీహెచ్ఎంసీ కొనసాగనుంది. ఈ మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక మండళ్లు బాధ్యతలు చేపట్టే వరకు ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్‌ను ప్రభుత్వం నియమించింది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిపాలన బాధ్యతలను ఆయన ప్రత్యేక అధికారిగా నిర్వహించనున్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని పరిపాలనా వ్యవహారాలను ఆయన పర్యవేక్షిస్తారు. నగర విస్తరణ, జనాభా పెరుగుదల మరియు పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నగర అభివృద్ధికి దోహదపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

## భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది

- లోక్‌సభలో రాహుల్ గాంధీ



**టి మీడియా, ఫిబ్రవరి 11 , ఢిల్లీ బ్యూరో :** భారత్ – అమెరికా మధ్యంతర ట్రేడ్ డీల్ ద్వారా భారతమాతను కేంద్ర ప్రభుత్వం అమ్మేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టి, రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి సర్కారు హోల్‌సేల్‌గా సరెండర్ అయిపోయిందని ఆయన ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. భారత్ – అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని, దీనివల్ల భారత రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. ఈ ట్రేడ్ డీల్ అమల్లోకి వస్తే, భారత మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవాహం భారీగా పెరుగుతుందని రాహుల్ తెలిపారు.అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇక భారతదేశ వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాతో ట్రేడ్ డీల్ ఫలితంగా ఇంధన భద్రతను భారత్ కోల్పోయిందన్నారు. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుందని రాహుల్ పేర్కొన్నారు. ట్రేడ్ డీల్‌పై చర్చల సందర్భంగా, భారత్‌ను సరిసమాన భాగస్వామిగా పరిగణించాలని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్‌ను కేంద్ర ప్రభుత్వం కోరి ఉండాల్సిందన్నారు. "మీ ప్రభుత్వం భారతదేశాన్ని అమ్మేసింది. దేశాన్ని అమ్ముతున్నందుకు సిగ్గుగా లేదా ? మీరు భారత మాతను అమ్మేశారు" అని రాహుల్ కామెంట్ చేశారు.ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం మోదీపై పడి ఉండొచ్చు "అంత సాధారణంగా భారత్‌ను ప్రధాని మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజ్ అయ్యాయని తెలిసినప్పటి


మిగతా 3లో..


## 7,189 నీటిపారుదలశాఖ పనులు

- చంద్రబాబు అధ్యక్షతన సమావేశం




**టి మీడియా, ఫిబ్రవరి 11, అమరావతి :** సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయా లకు ఆమోదం తెలిపింది. నీటిపా రుదల శాఖలోని 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపారు. భూము లు బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 1000 చ.గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో 6 నెలలు పొడిగిస్తూ అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములలో నివాసాలు ఏర్పరుచుకున్న అనధికార ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకూ అనుమతికి క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని సర్వే నెం.29/8లోని 3.84 ఎకరాల భూమిని "కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం" కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్?ఆర్?ఈడీసీఏపీకి కాంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదించనుంది. నంద్యాల జిల్లా సంజామల మండలం నోస్సం గ్రామంలో 1500 ఎకరాలు భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం ఎన్ఆర్ఈడీసీఏపీకి కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదించనుంది.

### ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్‌కి ఆమోదం

విశాఖపట్నం ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో 18.57 ఎకరాలు ప్రభుత్వ భూమి కేటాయింపుపై మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశముంది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో ఏపీఎస్?డీసీ కోసం డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలపనుంది. డీఎస్‌డబ్ల్యూఎస్ (సవరణ) బిల్లు 2026ను శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. అమరావతి మెరినా అభివృద్ధికి (పీపీపీ మోడల్) 33 సంవత్సరాల లీజు ప్రాతిపదికన, టెండర్లకు ఆహ్వానించింది. పీఎంఏవై గ్రామీణ్ 2.0లో యూనిట్ ఖర్చు రూ.2 లక్షల 39 వేలుగా నిర్ణయించి క్యాబినెట్ అంగీకారం తెలపనుంది.రామాయపట్నం పోర్ట్ అభివృద్ధి కార్పొరేషన్ రుణ పునర్వినియోగం, రాష్ట్ర హామీ, కంఫర్ట్ లెటర్ జారీ తదితర అంశాలపై మంత్రివర్గం చర్చించింది. ఎన్నికల ఓటర్ల జాబితా ప్రచురణకు ఏడాదికి 4 అర్హత తేదీలను కల్పించేందుకు సవరణ బిల్లుకు కేబినేట్ ఆమోదించింది. యాగంటి పీఎస్పీ (1000 ఎండబ్ల్యూ), రాజుపాలెం పీఎస్పీ (800 ఎండబ్ల్యూ) ప్రాజెక్టులను ఏపీ జెన్కో స్వతంత్రంగా అమలు చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. ఏపి ట్రాన్స్‌కోలో కడప జోన్ పరిపాలన కోసం అసిస్టెంట్ సెక్రటరీ పోస్టు సృష్టి ప్రతిపాదనకు ఆమోదం తెలపనుంది. సుజ్లాన్ ఓ యాక్సిస్ సంస్థల అభ్యర్థన మేరకు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అమలు గడువును మరో 2 సంవత్సరాలు పొడిగిస్తూ మంత్రివర్గం నిర్ణయించింది.

# ప్రగతి పథం వైపు అడుగులు

## -గవర్నర్ అబ్దుల్ నజీర్



**టి మీడియా, ఫిబ్రవరి 11 , అమరావతి :** 19 నెలలుగా కూటమి ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోందని గవర్నర్ అబ్దుల్? నజీర్? అన్నారు. బడ్జెట్? సమావేశాల నేపథ్యంలో గవర్నర్? ఇరు సభలనుద్దేశించి ప్రసంగించారు. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ఏపీ ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటిపారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవి చూశాయన్నారు. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. 2019నుంచి అభివృద్ధికి విఘాతం: "రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలు చవిచూశాయి. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి నాటి ప్రభుత్వం కృషి చేసింది. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు ఈ పురోగతికి విఘాతం కలిగించింది. తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది, వ్యవస్థలు విధ్వంసమయ్యాయి, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించి అరాచకత్వం ప్రబలింది. గత ప్రభుత్వంలో సెక్షన్ 22ఏ దుర్వినియోగం ద్వారా ఏకపక్ష ఆంక్షలు విధించారు" అని గవర్నర్? అన్నారు. విధానాలు, వ్యవస్థలు, వ్యయప్రాధాన్యతలలో కీలక సవరణలు చేశాం. దీర్ఘకాలిక దార్శనికతతో కూడిన పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి 10 సూత్రాలు రూపొందించాం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశించిందని వివరించారు. 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, రూ.55 లక్షల తలసరి ఆదాయం సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది" అని తెలిపారు. 25 కంటే ఎక్కువ నూతన విధానాలు: "క్వాంటం టెక్నాలజీ ద్వారా అమరావతి గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు సంకల్పించింది. 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నియంత్రణపై చట్టపరమైన విధివిధానాలు పరిశీలిస్తున్నాం. ఏపీ జీఎస్‌డీపీ రూ.15.91 లక్ష కోట్ల నుంచి రూ.17.62 లక్షల కోట్లకు పెరిగింది. దాదాపు 10.75 శాతం నామమాత్రపు వృద్ధి నమోదు చేసింది. 2027 గోదావరి పుష్కరాల కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం 25 కంటే ఎక్కువ నూతన విధానాలను ఆవిష్కరించింది. ట్రూడౌన్ విధానం ఫలితంగా యూనిట్‌కు 13 పైసల విద్యుత్ ఛార్జీ తగ్గింది" అని అన్నారు.'రూ.13.25 లక్షల కోట్లు పెట్టుబడుల కోసం 610 ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. సీఐఐ సదస్సులో పెట్టుబడుల ద్వారా 16.13 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. నిరంతర అధిక వృద్ధిరేటుపై దృష్టి సారించాం. దీర్ఘకాలిక లక్ష్యాలు స్థిరంగా ఉన్నా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా సవరణలు చేసుకుంటున్నాం. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లతో తరచూ సమావేశాలు జరుపుతున్నాం. క్వాంటం కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో ఏపీ క్రమంగా అడుగులు వేస్తోంది. అంతర్జాతీయ సంస్థలు, ప్రతిభావంతులకు రాష్ట్రం నెలవుగా నిలుస్తోంది.' - అబ్దుల్ నజీర్, గవర్నర్

### స్వర్ణాంధ్ర విజన్ 2047

అమరావతి భవిష్యత్తును నాశనం చేసే ఉద్దేశంతో గత ప్రభుత్వం 3 రాజధానుల ప్రతిపాదనను శ్వేతపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఎండగట్టిందని గవర్నర్? అన్నారు. "మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం. శాంతిభద్రతల పరిరక్షణకు 5,757 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం. పేదరికం లేని సమాజం కోసం పీ4 విధానం తీసుకొచ్చి లక్ష మందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నాం. స్వర్ణాంధ్ర విజన్ 2047 కింద అందరికీ ఇళ్లు ఉండాలని సంకల్పించాం. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే దిశగా గణనీయ పురోగతి సాధించాం. ఏపీ ప్రభుత్వం సమగ్ర జనాభా నిర్వహణ విధానం ప్రవేశపెట్టిందని గవర్నర్ అబ్దుల్ నజీర్ ?వెల్లడించారు. గవర్నర్? ప్రసంగం అనంతరం సభ రేపటికి వాయిదా పడింది.

### వైఎస్సార్సీపీ ఆటంకం

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వైఎస్సార్సీపీ నేతలు నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. సమావేశాలు మొదలుకావడానికి ముందే అసెంబ్లీ గేటు ముందు ప్రతిపక్ష హోదా గుర్తింపు ఇవ్వాలని వైఎస్సార్సీపీ మ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం జగన్ సైతం ప్లకార్డులను పట్టుకుని నేతల వెంట అసెంబ్లీలోకి బయలుదేరారు. గవర్నర్? ప్రసంగం సమయంలో పదేపదే ఆటంకం కలిగిస్తూ నినాదాలు చేశారు. సభ ప్రారంభమైన కాసేపటికే సభ నుంచి వెళ్లిపోయారు.

### స్పీకర్ సరదా వ్యాఖ్యలు

11వ తేదీ, 11 మంది, 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా అని వైఎస్సార్సీపీ సభ్యులను ఉద్దేశించి స్పీకర్? అయ్యన్నపాత్రుడు అన్నారు. అసెంబ్లీలో ఇరు సభలను ఉద్దేశించి గవర్నర్? అబ్దుల్? నజీర్? ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ లాబీలో స్పీకర్? సరదా వ్యాఖ్యలు చేశారు. '11వ తేదీన 11 మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా? అని వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలు పాటిస్తే మంచిదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు.

# శ్రీశైలంలో సాయుధ బలగాలు

## -భక్తుల రద్దీ కంట్రోల్ కోసం రంగంలోకి



**టి మీడియా, ఫిబ్రవరి 11 ,నంద్యాల :** జిల్లా శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో అదుపు తప్పిన ఘటనలు చోటుచేసుకున్నాయి. శివస్వాములు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో బందోబస్తు విధులకు స్పెషల్? పార్టీ, ఆర్మ్‌డ్? రిజర్వ్?, ఏపీఎస్?పీ సిబ్బంది కర్నూలు..నంద్యాల.. అన్నమయ్య జిల్లాల నుంచి 180 మంది సాయుధ బలగాలు విధులు నిర్వహిస్తారు. వీరికి నంద్యాల ఎస్పీ సునీల్ షొరాణ్ దిశా నిర్దేశం చేశారు. శివదీక్షను ధరించిన భక్తులు సుదూర ప్రాంతాల నుంచి శ్రీశైలం మల్లన్న దర్శనానికి వస్తారు. భక్తులు ఎంతో కఠిన దీక్షచేసి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దర్శనానికి వస్తారు. మల్లన్న భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. శివస్వాములతో గౌరవప్రదంగా మాట్లాడాలని .. వారికి ప్రశాంతంగా దైవ దర్శనం కలిగేలా అన్ని రకాలుగా దిశా నిర్దేశం చేయాలని సూచించారు. విధులలో ఉన్న సిబ్బంది ఎట్టి పరిస్థితిలో సహనం ల్పోకూడదన్నారు. ఎవరికి కేటాయించిన ప్రదేశాల్లో వారు నిరంతరం విధులు నిర్వహించాలన్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నా.. అనుకోని సంఘటన జరిగినావెంటనేసంబంధితఅధికారులకుసమాచారం అందించాలన్నారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల బందోబస్తుకు వచ్చిన సిబ్బందిని రెండు సెక్షన్లుగా విభజించారు. చంద్రావతి కళ్యాణమండపం, ఫ్రీ క్యూ లైన్ ,లడ్డు కౌంటర్, గంగాధర మండపం, నంది సర్కిల్, దాసరి సత్రం ,ఆర్టీసీ బస్టాండ్ ,సిద్ధరామయ్య కాంప్లెక్స్ ,పాతాళగంగ, స్నాన ఘట్టాలు , పార్కింగ్ ప్రదేశాలలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల బందోబస్తు సిబ్బందికి దిశా నిర్దేశం చేసే కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్ , శ్రీశైలం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ జీవన్ గంగానాథ్ బాబు , రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 108 లోనే సుఖ ప్రసవం



**టీ మీడియా, ఫిబ్రవరి 11 ,పెబ్బేరు :** పెబ్బేర్ మండల పరిధిలోని యాపర్ల గ్రామానికి చెందిన భూమిక అనే గర్భిణి మహిళ బుధవారం తెల్లవారుజామున తీవ్రమైన పురిటి నొప్పులతో బాధపడింది .పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర సేవలైన 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో విధులు నిర్వహిస్తున్న 108 అంబులెన్స్ టెక్నీషియన్ రాము పైలెట్ మైనుద్దీన్ తక్షణమే యాపర్ల గ్రామానికి చేరుకున్నారు గర్భిణిని అంబులెన్స్‌లోకి ఎక్కించి వనపర్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా పెబ్బేర్ కంచిరావుపల్లి గ్రామాల మధ్య మార్గమధ్యంలోనే ప్రసవ వేదనలు మరింతగా పెరిగాయి పరిస్థితిని గమనించిన 108 సిబ్బంది అప్రమత్తమై ఎలాంటి ఆలస్యం చేయకుండా అంబులెన్స్‌లోనే అవసరమైన వైద్య సహాయాన్ని అందించారు అత్యవసర పరిస్థితుల్లోనూ అత్యంత నైపుణ్యంతో వ్యవహరించిన టెక్నీషియన్ రాము పైలెట్ మైనుద్దీన్ సహకారంతో భూమికకు అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం చేసి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లి శిశువును పూర్తిగా సురక్షితంగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు ప్రస్తుతం తల్లి బిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఇది భూమికకు నాలుగవ కాన్పు కాగా సమయానికి 108 సేవలు అందుబాటులోకి రావడం వల్ల ప్రాణాపాయ పరిస్థితి తప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు అత్యవసర సమయంలో అద్భుత సేవలందించిన 108 సిబ్బంది రాము మైనుద్దీన్‌లకు భూమిక భర్త శివానంద్ సహా కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు 108 అత్యవసర సేవల వేగవంతమైన స్పందన మరోసారి ప్రాణాలను కాపాడిందని స్థానికులు ప్రశంసించారు.

# నాన్ కేడర్ ఐఏఎస్‌ల బదిలీ

## -జలమండలికి ముగ్గురు ఈడీలు



**టి మీడియా, ఫిబ్రవరి 11 , హైదరాబాద్ :** రా ష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లతో పాటు నాన్ కేడర్ అధికారులను కూడా రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎస్.పంకజను జలమండలి ఈడీగా నియమించింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.జీహెచ్ఎంసీని రాష్ట్ర ప్రభుత్వం మూడు ముక్కలుగా విడగొట్టిన నేపథ్యంలో జలమండలిలో మూడు కార్పొరేషన్లకు సంబంధించి వేర్వేరు ఈడీలుగా నియమించారు. ఇప్పటివరకు జలమండలి ఈడీగా ఉన్న ఐఏఎస్ మయాంక్ మిట్టల్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి కార్పొరేషన్‌కు సంబంధించి జలమండలి ఈడీగా పంకజను నియమించారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి జలమండలి ఈడీగా సామ్రాట్ అశోక్ నామాకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే సైబరాబాద్‌కు సంబంధించి జలమండలి ఈడీగా రంగారెడ్డి రిజిస్ట్రార్‌గా ఉన్న సంతోశ్‌లను కూడా జలమండలి ఈడీలుగా నియమించారు. అలాగే ఉపాధి శిక్షణ శాఖ సహాయ సంచాలకుడిగా ఉన్న శశికిరణాచారిని లోక్ భవన్ జాయింట్ సెక్రటరీగా బదిలీ చేశారు.

### ప్రైవేట్ స్కూల్ భవనంలో...

# చెలరేగిన మంటలు



**టి మీడియా, ఫిబ్రవరి 11 , సంగారెడ్డి:** జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. పోతిరెడ్డి పల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్ లో ఒక్కసారిగా మంటల చెలరేగాయి. చూస్తుండగానే మంటలు భవనం మొత్తం వ్యాపించాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది ఫైర్ ఇంజన్లతో మంటలార్పుతున్నారు. వివరాల్లోకి వెళితే..సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లిలోని శ్రద్ధ ప్రైవేట్ స్కూల్ భవనంలో బుధవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది.జీ ప్లస్ 3 అంతస్తు ల భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు మిగతా మిగతా మూడు ఫ్లోర్లకు అంటుకున్నాయి. దట్టమైన పొగలు పెద్ద ఎత్తు మంటలు భవనం మొత్తం వ్యాపించాయి. మంటల్లో భవనం మొత్తం తగలబడిపోయింది. ఈ ఘటనతో స్థానికులు పరుగులు పెట్టారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్లతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలార్పుతున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ఉన్నందున స్కూల్ కు సెలవు ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పింది. షార్క్ సర్క్యూట్ కారణంగా మంటలంటుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

### మహిళ మెడలోంచి

# గొలుసు లాక్కెళ్లిన దుండగులు



**టి మీడియా, ఫిబ్రవరి 11 , ఆబిడ్స్ :** హైదరాబాద్ నగరంలో చైన్ స్నాచర్‌లు రెచ్చిపోతున్నారు. ఒంటి మహిళలే లక్ష్యంగా గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇవాళ (బుధవారం) ఉదయం 11 గంటలకు అబిడ్స్ ఏరియాలో బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఓ మహిళ మెడలోంచి చైన్‌ను లాక్కెళ్లారు. చైన్‌ను గట్టిగా లాగడంతో ఆ మహిళకు గాయాలయ్యాయి. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకి వెళ్తే.. చాపెల్ రోడ్డులోని మల్లారెడ్డి ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న శిరీష అనే మహిళ విధులు ముగించుకుని హాస్టల్‌కు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఘటనా ప్రాంతంలోని సీపీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కాగా నగరంలో చైన్ స్నాచింగ్ ఘటనలు పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.



# గ్రామ సభలో కీలక తీర్మానాలు

**టీ మీడియా ఫిబ్రవరి 11: టేక్మాల్ ప్రతినిధి:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని గల గ్రామం లో ఎలకుర్తి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాలపై పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. మురికి కాలువల శుభ్రత, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు మూతలు, ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ అనుమతి తప్పనిసరి చేయాలని నిర్ణయించారు. అవసరమైన చోట కరెంట్ స్తంభాలు మంజూరు, రోడ్ల సరిహద్దులు దాటి నిర్మించిన ఇండ్లపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. ఆరోగ్య సబ్‌సెంటర్, అంగన్వాడీ, ఐకేపీ భవనాల నిర్మాణం, ఏటిగడ్డకు మట్టి రోడ్డు, కట్టల మరమ్మతులు, బ్రిడ్జి నిర్మాణం వంటి పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. సమావేశంలో సర్పంచ్ దేవప్రసాద్, ఉపసర్పంచ్ వాణి నవీన్, సెక్రటరీ సత్యనారాయణ, వార్డు సభ్యులు గౌండ్ల జ్యోతి యాదవ్ గౌడ్, ఎర్రోళ్ల దుర్గయ్య, ఎం. ప్రభాకర్, కుర్తి రాజు రెడ్డి, షాదుల్, కుర్తి మహేష్ రెడ్డి, వేముల అనిత, ప్రమీల, మౌనికతో పాటు అధికారులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మూడు కార్పొరేషన్లుగా విడిపోయిన జీహెచ్ఎంసీ

## -కొత్త కమిషనర్లు వీరే




**టి మీడియా, ఫిబ్రవరి 11 , హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు గ్రేటర్ సైబరాబాద్, గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుత పాలకమండలి ఐదేళ్ల గడువు నిన్నటితో ముగిసింది. దీంతో ఇవాళ్టి నుంచి గ్రేటర్ ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లనుంది. ఈ క్రమంలో మూడు కార్పొరేషన్ల విభజనను రాష్ట్ర ప్రభుత్వం ఇవాళ్టి నుంచి అమలులోకి తీసుకొచ్చింది. ఈ మూడు కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లను నియమించింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్‌ను యథాతథంగా కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వినయ్ కృష్ణా రెడ్డిని నియమించింది. జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన నేపథ్యంలో జలమండలి పరిధిని కూడా ఓఆర్ఆర్ వరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తరించింది. జలమండలి పరిధి విస్తరించడంతో ముగ్గురు అధికారులను ఈడీలుగా నియమించింది. ఇప్పటివరకు జలమండలి ఈడీగా ఉన్న ఐఏఎస్ మయాంక్ మిట్టల్‌కు జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. మల్కాజిగిరి కార్పొరేషన్‌కు సంబంధించి జలమండలి ఈడీగా పంకజను నియమించారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించి జలమండలి ఈడీగా సామ్రాట్ అశోక్ నామాకు పోస్టింగ్ ఇచ్చారు. అలాగే సైబరాబాద్‌కు సంబంధించి జలమండలి ఈడీగా రంగారెడ్డి రిజిస్ట్రార్‌గా ఉన్న సంతోశ్‌లను కూడా జలమండలి ఈడీలుగా నియమించారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు పరిదిలోని నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్ఎంసీ నుంచి జలమండలికి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది.

### చేసేది సాఫ్ట్‌వేర్ జాబ్,

# సార్‌దంతా నైట్ డ్యూటీనే



**టి మీడియా, ఫిబ్రవరి 11 ,హైదరాబాద్ :** సూటు, బూటు వేసుకుని హీరోలా రెడీ అవ్వడం, కాలు బయటపెట్టాడంటే బీఎండబ్ల్యూ కారులోనే ప్రయాణం. చేసేది సాఫ్ట్‌వేర్ జాబు అయినప్పటికీ వెంట ఎప్పుడూ హార్ట్‌వేర్ టూల్స్ ఉండాల్సిందే. తలపైనటోపీ, చేతులకుగ్లౌవ్స్, ముఖానికి మాస్క్ తప్పనిసరి. సాఫ్ట్‌వేర్బాయ్ కదాఎండకుకంది పోతాడను కుంటున్నారేమో అసలు మనోడు ఎండకు బయటకే రాడు ఎందుకంటే సార్‌ది అంతా నైట్ డ్యూటీనే. ఇంతకీ అతను చేసే ఉద్యోగం ఏంటి? రాత్రిపూట మాత్రమే పని ఎందుకు ఉంటుంది? సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి అసలు హార్డ్‌వేర్ టూల్స్‌తో పనేంటి అంటే మాత్రం ఈ కథనం చదవాల్సిందే.హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి ఉద్యోగం. నెలకు మంచి జీతం. ఉండటానికి ఇల్లు, తిరగడానికి కారు అన్నీ ఉన్నాయి కానీ. సహోద్యోగుల వద్ద గొప్పింటి బిడ్డలా ఫోజులివ్వడం అతనికి అలవాటు. ఆ డాబు, దర్పం కనిపించేలా మంచి బట్టలు, షఉస్ వేసుకుని టిప్‌టాప్‌గా రెడీ అవుతాడు. బీఎండబ్ల్యూ కారులో షికార్లు కొడుతుంటాడు. విలాసవంతమైన జీవితం గడుపుతూ తనకు తాను యువరాజులా ఫీలవుతుంటాడు. మరి వీటన్నింటికీ డబ్బులు ఎలా అని అడిగితే సైడ్ బిజినెస్ ఉందంటూ దాటవేసేవాడు. వేరేచోట నైట్‌డ్యూటీ కూడా చేస్తున్నాని తప్పించుకునేవాడు. పోలీసులు అరెస్ట్ చేస్తే గానీ వారికి అర్థం కాలేదు ఆ యువకుడు చేసే బిజినెస్ ఏంటో? వేరేచోట అతను చేసే నైట్‌డ్యూటీలు ఏంటో.

15వ ఏట నుంచే అడ్డదారులు: విశాఖకు చెందిన అచ్చి మహేశ్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి విలాసవంతంగా జీవించడమంటే ఎంతో ఇష్టం. కానీ కుటుంబ పరిస్థితులు అందుకు అనువుగా లేవని తనకు తానే ఓ అందమైన జీవితాన్ని సృష్టించుకున్నాడు. అందుకోసం 15వ ఏట నుంచే అడ్డదారులు తొక్కాడు. దొపిడీలు, దొంగతనాలు చేసి వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం ఆరంభించాడు. పీఎం పాలెంలో 4 దొంగతనాలు చేసి పోలీసులకు పట్టుబడి జువైనల్‌హోమ్‌కు వెళ్లాడు. బయటకు వచ్చినా మహేశ్‌రెడ్డి తీరులో మార్పురాలేదు. చదువుకుంటూనే తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేస్తూ వచ్చాడు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా తన ప్రవృత్తిని మాత్రం మార్చుకోలేదు.గాజువాకకు చెందిన కన్నా శివరామకృష్ణ ఇంటికి తాళం వేసి అరుణాచలం వెళ్లగా ఆ ఇంట్లో మహేశ్‌రెడ్డి చోరీ చేశాడు. 17 తులాల బంగారం, 30 తులాల వెండి దోచుకెళ్లాడు. తాళం పగులగొట్టి ఉండటం చూసి ఇంటి యజమానికి శివరామకృష్ణకు ఫోన్‌చేసి చెప్పగా పరుగుపరుగున వచ్చి చూస్తే ఇంట్లో సామాన్లు అన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. సుమారు 4 లక్షల 30 వేల విలువైన సొత్తు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా నిందితుడు మహేశ్‌రెడ్డిని పట్టుకున్న పోలీసులు సొత్తు రికవరీ చేశారు. దొంగతనానికి మహేశ్‌రెడ్డి చాలా పకడ్బందీగా వెళ్తాడు. ఎవరూ చూడకుండా ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరిస్తాడు. వేలిముద్రలు పడకుండా చేతులకు గ్లౌవ్ వేసుకుంటాడు. అలాగే తాళాలు పగులగొట్టడానికి సుత్తి, స్క్రూడ్రైవర్ వంటివి వెంట తీసుకెళ్తాడు. ఒక్క విశాఖలోనే 26 చోరీలు చేసిన నిందితుడు ఏపీ మొత్తం మీద 62 దొంగతనాలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అలాగే రాజమహేంద్రవరం జైలులో 14 నెలల పాటు శిక్ష అనుభవించాడు.




# ఆటోల బంద్‌కు జేఏసీ పిలుపు

**టి మీడియా, ఫిబ్రవరి 11 , విజయవాడ:** నగరంలో గురు వారం రోజు ఆటోలు బంద్ నిర్వహిం చనున్నట్లు ఆటో జేఏస ీ ప్రకటించింది. తమడిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఏసీ నేతలు తెలిపారు. జీవో నంబర్ 21తో పాటు బి ఎన్ ఎస్ 106 (1), (2)లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిబంధనల వల్ల ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు..మరోవైపు.. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చిన "స్త్రీశక్తి" స్కీమ్.. అమలు కారణంగా ఆటో డ్రైవర్ల జీవనోపాధి దెబ్బతింటోందని ఆరోపిస్తూ, నష్టపోయిన ప్రతి ఆటో డ్రైవర్‌కు రూ.25,000 నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. ఇక, ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు బదులుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దీని ద్వారా మధ్యవర్తుల దోపిడీ తగ్గి డ్రైవర్లకు నేరుగా లాభం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# ప్రశాంతంగా ముగిసిన పుర ఎన్నికలు



**టీ మీడియా, ఫిబ్రవరి 11, రామకృష్ణాపూర్;** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూ ర్ లో మున్సిపాలిటీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిసాయి .మొత్తం 22 వార్డులు 45 పోలింగ్ కేంద్రాలలో సిబ్బంది ఉదయం 7:00 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి విధులను నిర్వహించారు. పోలీస్ సిబ్బంది కూడా ఎలాంటి గొడవలు జరగకుండా చూడడం జరిగింది. పుర ప్రజలు ఓటు హక్కును తమ హక్కుగా భావించి ఓటును సద్వినియోగం చేసుకున్నారు. అలాగే క్యాతనపల్లిలోని 17వ వార్డ్ బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థిగా గోడిసెల సంధ్యారాణి రాజా రమేష్ దంపతులు సెయింట్ జోసెఫ్స్ స్కూల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఆదర్శ గ్రామంగా మారుస్తా..

## సర్పంచ్ నరసింహారావు దేశ్పాండే..



**టీ మీడియా ,ఫిబ్రవరి 11, టేక్మాల్ ప్రతినిధి :**మెదక్ జిల్లాలోని టేక్మాల్ మండల లో సమాజసేవే తన లక్ష్యంగా ముందుకు సాగుతానని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తన ఆలోచనకు పదును పెట్టి అభివృద్ధి పథంలో గ్రామాన్ని ముందుకు తీసుకెళుతున్న దాదాయపల్లి సర్పంచ్ పై ప్రత్యేక కథనం ఇది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనపై నమ్మకం ఉంచి గ్రామ ప్రథమ పౌరునిగా పట్టాభిషేకం చేశారు. సమాజ సేవతో ముందుకు సాగాలన్న సంకల్పానికి స్థానిక ఎన్నికలు అవకాశాన్నిచ్చాయి. ఈయన అటు హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతున్నారు. సమాజ సేవకు సమాజ సేవకు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఎన్నికల బరి నిలిచి విజయడంక మోగించారు. దీంతో అటు హైకోర్టు న్యాయవాదిగా, ఇటు గ్రామ ప్రజల పౌరునిగా దిపాత్రాభినయం గా కొనసాగుతున్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామాభివృద్ధి చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నాన ని ఆయన చెప్పారు. ప్రగతికి పట్టుకొమ్మలు పల్లె సీమలని అంటారు. కన్న తల్లిదండ్రులను, ఉన్న ఊరును మరచి పోవద్దని సదుద్దేశంతో గ్రామానికి నా వంతుగా సేవ, గ్రామాభి వృదే లక్ష్యంగా పెట్టుకోవడం చాలా అభినందనీయమని దాదాయపల్లి సర్పంచ్ నర్సింహా రావు దేశ్పాండే అన్నారు. గ్రామంలో 10 లక్షల సిసి రోడ్డు, వీధి దీపాలు, గడి పెద్దాపూర్ నుండి దాదాయపల్లి గ్రామం వరకు ఉన్న రెండు కిలోమీటర్ల రహదారిపై పిచ్చి మొక్కల తొలగింపు తో పాటు సైడ్ మట్టి పోయడం జరుగుతుందన్నారు. పాఠశాల ప్రహరి గోడ నిర్మాణం, గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమలతో అభివృద్ధి అంటే ఇలా ఉండాలి అనిపిస్తుంది. గ్రామంలో రోడ్ల అన్ని ఇరుకుగా ఉండడంతో సొంత భూమిని సైతం గ్రామాభివృద్ధి కోసం దారా దత్తం చేస్తున్న వైనం ఇది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గుడి నిర్మాణం పనులు, చత్రపతి విగ్ర ప్రతిష్టాపన తోపాటు ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన (రోడ్లు, నీరు, విద్యుత్), నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత, సాంకేతికతను (బ్రాడ్బ్యాండ్) ఉపయోగించడం ద్వారా గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన ధ్యేయమన్నారు. విద్యాభివృద్ధికి తన వంతుగా ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అనే నినాదంతో ఐదవ తరగతి దాటిన ప్రతి బాలికకు ( విద్యార్థు)లకు సైకిళ్ల పంపిణీ చేశారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారికి ఆర్థిక సహాయంగా తక్షణమే పది వేల రూపాయలను అందజేస్తున్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యాన్ని చేరుకోవడానికి అవసరమైన సమగ్ర ప్రణాళిక గ్రామసభల ద్వారా ప్రజల భాగస్వామ్యంతో గ్రామానికి అవసరమైన ప్రత్యేక ప్రణాళికను రూపొందించుకున్నామన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు, పారిశు ధ్యం, సురక్షిత తాగునీరు, రవాణా సౌకర్యాలను మెరుగు పరుస్తామన్నారు. నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా గ్రామస్థులకు అందిస్తామన్నారు.గ్రామాల అభివృద్ధే - దేశాభివృద్ధి అనే నినాదంతో, ప్రజా భాగస్వామ్యంతో పని చేస్తే, ఆదర్శ గ్రామంగా మారుతుందన్నారు. గ్రామాభివృద్ధి కోసం మంత్రి దామోదర్ రాజనర్సిహను కలిసి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించినట్టు ఆయన చెప్పారు. గ్రామాభివృద్ధి కోసం సమస్య కృషి అవసరమని అందుకు అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన అన్నారు.

## శ్రీశైలం బయలుదేరిన
# శివ స్వాములు



**టీ మీడియా, ఫిబ్రవరి 11, టేక్మాల్ ప్రతినిధి:**మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలో బోడ్మట్ పల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో మండల కాలంగా శివ స్వాములు భక్తిశ్రద్ధలతో, నియమనిష్టలతో శివదీక్ష చేపట్టి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ శ్రీశైలం మల్లికార్జున స్వామి వారికి ముడుపులను ముట్టజెప్పి దీక్ష విరమించేందుకు బుధవారం సుమారు 20 మంది శివ స్వాములు ఇరుముడులు కట్టుకొని శ్రీశైలం బయలుదేరు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం ఇరుముడి కట్టే కార్యక్రమం నిర్వహించారు. హర హర మహాదేవ ఓం నమః శివాయ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా గురు స్వామి మాట్లాడుతూ, శివ భక్తులు నియమ నిష్టలతో దీక్ష చేపట్టి ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. సంవత్సరాలుగా శివ స్వాములు మాలలు ధరించి శివదీక్ష పూని ఇక్కడినుండి యాత్రగా వెళ్లి శివరాత్రి పర్వదినాన శ్రీశైల మల్లన్నకు ఇరుముడులు సమర్పించడం ఆనవాయుతుగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా శివ స్వాములు సమూహంగా శ్రీశైలం యాత్రకు వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.యాత్రకు బయలుదేరిన శివ స్వాములకు కుటుంబ సభ్యులు, భక్తులు పూలమాలలు వేసి ఆశీర్వాదాలు అందించి వీడ్కోలు పలికారు. భక్తులు శివ స్వాములు వివిధ వాహనాలలో శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో శివ గురుస్వాములు భక్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పుర పోలింగ్

ఈ క్రమంలో పోలీసులు-జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్కి సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

### కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ

మహబూబాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. 14వ వార్డు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి గాడిపల్లి నాగేశ్వరరావుపై బీఆర్ఎస్ అభ్యర్థి బత్తుల కృష్ణ చేయిచేసుకున్నారు. ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలోని 20 వార్డులో సీపీఎం, సీపీఐ కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. ఇల్లందు 13 వార్డులో మాజీమున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకట్ గౌడ్ టేకులపల్లి సీఐ సత్యనారాయణ మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది.నాగర్కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో దొంగఓట్ల కలకలం రేపింది. కాంగ్రెస్ అభ్యర్థి ఇసాక్ అనుచరుడు హమీద్ దొంగ ఓట్లు వేసేందుకు ఇద్దరు అమ్మాయిలని తీసుకువచ్చారని వారిని ప్రత్యర్థులు ఆపటంతో ఇరువర్గాల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

### మిర్యాలగూడలో ఉద్రిక్తత

నల్గొండ జిల్లా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. 29వ వార్డులో సీపీఎం, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలో సీపీఎం కార్యకర్తకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్?రావు కుమారుడు సిద్ధార్థపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి దిగారు. మరోవైపు నల్గొండ కార్పొరేషన్? పదోవార్డులో కూడా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా బీజేపీ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. దొంగఓట్లు వేసేందుకు యత్నించిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### రంగారెడ్డి జిల్లాలో ఉద్రిక్తత

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ శేరిగూడలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. శేరిగూడ పోలింగ్ కేంద్రం ముందు ఓ ఇంట్లో గుమికూడిన గుంపును చెదరగొట్టేందుకు వచ్చిన పోలీసులతో యువకులు వాగ్వావాదానికి దిగారు. వారిని స్టేషన్కి తరలిస్తుండగా పోలీస్ వాహనానికి కుటుంబసభ్యులు అడ్డుపడ్డారు. ఇంట్లో ఉన్నవారిని ఎలా తరలిస్తున్నారంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘర్షణకు దిగిన ఇద్దరు యువకులను పీఎస్కు తరలించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. 13వ వార్డులో ప్రత్యర్థులు దొంగఓట్లు వేస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు గొడవకి దిగగా ఇరువర్గాలకి సర్దిచెప్పారు.

పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. సంగారెడ్డిలో 34 వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి చొక్కాను సీఐ పట్టుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామని బూత్లోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది.



## పునరుజ్జీవన ప్రాజెక్టులో...
# కీలక పరిణామం

- భూసేకరణ షురూ

**టి మీడియా, ఫిబ్రవరి 11 ,హైదరాబాద్ :**మూసి పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రభుత్వం మూసి అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. ఈ మేరకు మూసి రివర్ డవలప్మెంట్ కార్పొరేషన్ కీలక ప్రకటన చేసింది. ఫేజ్ఏ 1 హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ఏ 2 ఉస్మాన్ సాగర్ నుండి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల మేర భూసేకరణ చేయనుంది. హైదరాబాద్, గోల్కొండ మండలం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల అక్విజిషన్ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరణకు చర్యలు ప్రారంభమయ్యాయి. భూమి యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. తమ హక్కుల పత్రాలు (పట్టాలు, ఆధార్, బ్యాంక్ వివరాలు) సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. నిర్ణీత సమయంలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని స్పష్టం చేసింది. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితా ప్రకటించింది. భూసేకరణ చట్టం, 2013 నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టనుంది.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాల పరిధిలో మూసి అభివృద్ధి పనులు చేపట్టనున్న విషయం తెలిసిందే. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55కిలోమీటర్ల పరిధిలోని 14 మండలాలు 46 గ్రామాల్లో దశల వారీగా 55 కిలో మీటర్ల మూసీ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.




# పాలల్లో ప్రమాదకరమైన బ్యాక్టీరియా

## - క్వాలిటీ టెస్టులో అముల్, మదర్ డైరీఫెయిల్

**టీ మీడియా ,ఫిబ్రవరి 11, హైదరాబాద్ బ్యూరో :** మనం ప్రతిరోజూ నమ్మకంతో కొనే అముల్, మదర్ డైరీ, కంట్రీ డిలైట్ వంటి పెద్ద కంపెనీల పాలల్లో ప్రమాదకరమైన బ్యాక్టీరియా ఉన్నట్లు ట్రస్టిఫైడ్ అనే సంస్థ జరిపిన పరీక్షల్లో తేలింది. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాల కంటే వీటిలో బ్యాక్టీరియా స్థాయిలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఈ రిపోర్ట్ చెబుతోంది.పరీక్షల్లో తేలిన ఇవే:మదర్ డైరీ: ఈ పాలల్లో ఉండాల్సిన దానికంటే 8 రెట్లు ఎక్కువగా బ్యాక్టీరియా ఉన్నట్లు గుర్తించారు.కంట్రీ డిలైట్: "నేరుగా ఫామ్ నుండి మీ ఇంటికి" అని ప్రచారం చేసుకునే ఈ పాలల్లో కూడా ఉండాల్సిన దానికంటే రెండింతలు ఎక్కువ బ్యాక్టీరియా ఉంది.అముల్: అముల్ తాజా, అముల్ గోల్డ్ పాలల్లో కోలిఫామ్ అనే బ్యాక్టీరియా చాలా ఎక్కువగా ఉన్నట్లు తేలింది.అముల్ పెరుగు: కేవలం పాలు మాత్రమే కాదు, అముల్ పెరుగులో కూడా వేల రెట్లు ఎక్కువగా బ్యాక్టీరియా ఉన్నట్లు పరీక్షల్లో బయటపడింది.ఎగ్గోజ్ గుడ్లు ఈ గుడ్లలో కూడా క్యాన్సర్కు కారణమయ్యే అనే నిషేధిత రసాయనం ఉన్నట్లు గుర్తించారు.దీనివల్ల వచ్చే ప్రమాదం ఏంటి:పాలల్లో బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటే వాంతులు, విరేచనాలు వంటి జీర్ణకోశ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై ఈ బ్యాక్టీరియా తీవ్ర ప్రభావం చూపుతుంది. గుడ్లలో దొరికిన రసాయనాలు క్యాన్సర్ వచ్చేలా చేస్తాయి.కంపెనీల వాదన:అయితే, అమూల్ వంటి కంపెనీలు ఈ టెస్టుల రిపోర్ట్ కొట్టిపారేశాయి. మేము ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పాలను విక్రయిస్తున్నామని చెబుతున్నాయి. కానీ ప్రభుత్వం దీనిపై ఇంకా ఎటువంటి స్పష్టమైన వివరణ ఇవ్వలేదుమదర్ డైరీ 1974లో స్థాపించగా, కంట్రీ డిలైట్ 2015లో స్థాపించబడింది. కానీ అమూల్ 1948 నుండి ప్రారంభమైన భారతదేశ అత్యంత పురాతనమైనది. అమూల్ ప్రతిరోజు తాగే పాల ప్యాకెట్ మాత్రమే కాదు, ఇతర పాల ఉత్పత్తులను కూడా అందిస్తుంది. అయితే పెద్ద పెద్ద కంపెనీల పాలల్లోనే లోపాలు బయటపడటంతో, మన దేశంలో ఆహార నాణ్యత ప్రమాణాలు ఎంతవరకు అమలవుతున్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

# భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది

నుంచి ప్రధాని మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటితో ముడిపడిన ఒత్తిడి ప్రభావం ప్రధానిపై పడిందేమో. వాళు ప్రధాని మోదీని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. ఇంకో 30 లక్షలకుపైగా ఎప్స్టీన్ ఫైల్స్ తదుపరి విడతల్లో రిలీజ్ కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు,ఉత్పత్తులపై అమెరికా 3 శాతం సుంకాన్నే విధించేది. కానీ ఇక నుంచి ఆరు రెట్లు అదనంగా 18 శాతం సుంకాన్ని విధిస్తుందట. ఇక ఇదే సమయంలో అమెరికా సరుకులపై భారత్ విధించే 16 శాతం సుంకాన్ని, సున్నాకు తగ్గిస్తారట. ఎందుకోసం ప్రధాని మోదీ ఇలాంటివన్నీ ఒప్పుకున్నారు ? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 100 బిలియన్ డాలర్లు దాటిస్తామని ట్రంప్కు మోదీ ఎందుకు హామీ ఇచ్చారు ?" అని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు.

### మోదీ, దోవల్ చెప్పిన దానికి రివర్స్లో ప్రపంచం పోకడ

"ప్రపంచంలో ఇక యుద్ధాల శకం ముగిసిందని గతంలో ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్ను గత సంవత్సరమే మనం చూశాం. రష్యా – ఉక్రెయిన్ యుద్ధం గత మూడేళ్లుగా జరుగుతోంది. ఇజ్రాయెల్ – గాజా సైనిక ఘర్షణను యావత్ ప్రపంచం చూసింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా కుట్రలను ఇప్పుడు చూస్తున్నాం. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలుచుకొని ప్రపంచ దేశాలపై అమెరికా ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆధిపత్యాన్ని, దాని డాలరు పెత్తనాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. అంటే మనం ఏకధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం దిశగా పయనిస్తున్నాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

### డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి

"భారత ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదికలో రెండు ముఖ్యమైన పాయింట్లను ప్రస్తావించారు. అవి నాకు నచ్చాయి. ప్రపంచ దేశాల నడుమ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, అమెరికా ఆధిపత్యాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు సవాల్ చేస్తున్నాయి అనేది తొలి పాయింట్. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి దేశాలపై దాడి చేసే పరిస్థితులు ప్రపంచంలో ఏర్పడుతున్నాయి అనేది రెండో పాయింట్. అందుకే అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని మనం సవాల్ చేయాలి. సింగిల్ సూపర్ పవర్ కాన్సెప్ట్ను ఒప్పుకోకూడదు. కానీ ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలి అనేది, మరో దేశం(అమెరికా) వాళ్లు నిర్ణయించాలా ? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా ? " అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

### అంబానీని ఎప్స్టీన్కు పరిచయం చేసింది ఎవరు.. ?


"జెఫ్రీ ఎప్స్టీన్ ఫైల్స్లో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు కూడా వచ్చింది. ఇప్పటిదాకా ఆయన్ను ఎందుకు జైలులో పెట్టలేదు ? అనిల్ అంబానీని జెఫ్రీ ఎప్స్టీన్కు పరిచయం చేసింది ఎవరు ? దీనికి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి సమాధానం చెప్పాలి. ఎప్స్టీన్కు అనిల్ అంబానీని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. ఈవిషయం హర్దీప్ సింగ్ పురికి కూడా తెలుసు. భారతదేశ రక్షణ రంగ బడ్జెట్లో కేంద్ర బిందువుగా అదానీ కంపెనీ ఉంది. ఆ కంపెనీ చెప్పినట్టుగానే రక్షణ రంగ బడ్జెట్ను కూర్చారు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

### డిజిటల్ ట్రేడ్ రూల్స్నూ ఫణంగా పెట్టారు

'భారత్ను పాకిస్థాన్తో అమెరికా పోల్చి చూడటానికి వీల్లేదు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ తనతో బ్రేక్ ఫాస్ట్ చేయాలని అమెరికా ప్రెసిడెంట్ కోరుకుంటే, అది జరిగిపోయింది. కానీ భారత్ విషయంలో అలా జరగలేదు. మేం మరోలా జవాబు ఇచ్చాం. కానీ ఇప్పుడు అదే అమెరికాతో అన్యాయమైన ట్రేడ్ డీల్ను మోదీ ప్రభుత్వం కుదుర్చుకుంది. చివరకు డిజిటల్ ట్రేడ్ రూల్స్నూ అమెరికా కోసం ఫణంగా పెట్టేందుకు కేంద్ర సర్కారు రెడీ అయిపోయింది. అమెరికా కంపెనీలు భారత్లో డేటా లోకలైజేషన్ చేయాల్సిన అవసరం లేని రూల్ను తెచ్చేందుకు ఓకే చెప్పారు. భారత్ నుంచి అమెరికాకు పూర్తి ఉచితంగా డేటా బదిలీకి అనుమతులు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. అమెరికా కంపెనీలపై విధించే డిజిటల్ ట్యాక్స్నూ తగ్గించేందుకు అంగీకరించారు. అమెరికా డిజిటల్ కంపెనీలు ఇకపై సోర్స్ కోడ్ను భారత సర్కారుకు బహిర్గతపర్చాల్సిన అవసరం లేని రూల్ను తెచ్చేందుకూ కేంద్ర ప్రభుత్వం రెడీ అయింది. ఆర్థిక మంత్రి నిర్మల బాగా నవ్వుతున్నారు. ఆమెకు నవ్వడం అంటే ఇష్టం. అమెరికా ప్రభుత్వం సూచించే కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేను ఇచ్చేందుకూ కేంద్రం ఒప్పుకుంది" అని రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు

# వరంగల్కు మరో భారీ రైల్వే ప్రాజెక్ట్

## - తొలి మెగా వ్యాగన్ రిపేర్ సెంటర్



**టీ మీడియా ఫిబ్రవరి 11, వరంగల్ :**రాష్ట్రంలో రైల్వే వ్యవస్థను మరింత బలోపేతం చేస్తూ, వరంగల్ ప్రాంతంలో గూడ్స్ రైలు పెట్టెల (వ్యాగన్ల) రిపేర్ కోసం ఒక భారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇది రాష్ట్రంలోనే మొట్టమొదటి మెగా ఫ్రైట్ ఓవర్ హాలింగ్ సౌకర్యం. సాధారణంగా గూడ్స్ రైళ్లకు చిన్న చిన్న రిపేర్లు కాజీపేట లేదా రామగుండం వంటి చోట్ల జరుగుతాయి. కానీ ఈ కొత్త కేంద్రంలో రైలు పెట్టెలను పూర్తిగా విడదీసి, ప్రతి భాగాన్ని క్షుణ్ణంగా చెక్ చేసి, మళ్లీ కొత్తవాటిలా అమర్చుతారు . ఈ ప్రక్రియ వల్ల సరుకు రవాణా చేసే రైళ్లు మరింత సురక్షితంగా, వేగంగా ప్రయాణించగలవు.ప్రస్తుతం తెలంగాణ వ్యాగన్లను రిపేర్ కోసం ఆంధ్రప్రదేశ్లోని రాయనపాడుకు పంపిస్తున్నారు. కొత్త సెంటర్ వస్తే ఇబ్బందులు తప్పి, ఖర్చు కూడా తగ్గుతుంది.ప్రాజెక్ట్ వివరాలు చూస్తే:ఈ ప్రాజెక్ట్ కోసం సుమారు రూ.1,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా కాజీపేట – మహబూబాబాద్ మధ్య దాదాపు 200 నుండి 300 ఎకరాల స్థలం కోసం రైల్వే అధికారులు వెతుకుతున్నారు. ఈ కేంద్రం ఏర్పాటుతో వందలాది మందికి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి.వరంగల్ ఇప్పటికే రైల్వే తయారీ యూనిట్ ఉంది. ఇప్పుడు ఈ మెగా రిపేరింగ్ సెంటర్ కూడా వస్తే, వరంగల్ ఒక కీలకమైన రైల్వే హబ్గా మారుతుంది. ముఖ్యంగా మన దగ్గర బొగ్గు, సిమెంట్, ఉక్కు రవాణా ఎక్కువగా జరుగుతుంది కాబట్టి, ఈ కేంద్రం చాలా అవసరం. భూమి సేకరణ పూర్తయ్యాక పనులు మొదలవుతాయి. రాబోయే 3 నుండి 5 ఏళ్లలో ఈ కేంద్రం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.



# నేడు భారత్ బంద్

ప్రజా రవాణా సేవలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. దుకాణాలు, మార్కెట్లు, వాణిజ్య కేంద్రాలు, స్కూల్స్, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడే ఛాన్స్ ఉంది. అయితే ఆస్పత్రులు, అంబులెన్స్లు వంటి అత్యవసర సేవలకు ఎటువంటి అంతరాయం ఉండకపోవచ్చు.అలాగే ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ , ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ , బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియావంటి యూనియన్లు కూడా భారత్ బంద్కు మద్దతు ప్రకటించాయి. అందువల్ల నగదు లావాదేవీలు, చెక్ క్లియరింగ్ వంటి కీలక సేవలు ఆలస్యం కావచ్చు. అయితే ఆర్బీఐ అధికారికంగా ఫిబ్రవరి 12 (గురువారం) బ్యాంకులకు ఎటువంటి సెలవు ప్రకటించలేదు. బంద్ ప్రభావంతో బ్యాంకింగ్ సేవలు కొంత మేర ప్రభావితం అయ్యే అవకాశం ఉంది.కేరళ, ఒడిశా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో భారత్ బంద్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రజలందరూ సమ్మెలో పాల్గొని బంద్ను జయప్రదం చేయాలని ఒడిశాలోని వామపక్ష పార్టీలు కోరాయి. కార్మికులు, రైతులు, ప్రజలు ఈ బంద్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. భువనేశ్వర్లో ఉమ్మడి విలేకరుల సమావేశం నిర్వహించి ఈ మేరకు వామపక్ష నేతలు వ్యాఖ్యానించారు.

### మహిళ భద్రత విషయంలో బీజేపీ విఫలం

ఒడిశాలోని బీజేపీ సర్కార్ మహిళలకు నైట్ డ్యూటీలు వేస్తుందని, కానీ వారికి భద్రత కల్పించడంలో విఫలమైందని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. ధాన్యం సేకరణ విషయంలోనూ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని విమర్శించాయి. ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో విస్తృతంగా అవినీతి జరుగుతోందని పేర్కొన్నాయి. మోటారు వాహన సవరణ చట్టంతో ప్రజలను వేధిస్తోందని మండిపడ్డాయి. ఒడిశాలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని, నేరస్థులు రాజకీయ నాయకుల రక్షణలో ఉన్నారని విమర్శించాయి. "ఒడిశాలో దళితులు, గిరిజనులు, మహిళలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ప్రభుత్వం ఒడిశా ఖనిజ వనరులను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తోంది. లక్షలాది మంది గిరిజనులు, దళితులు మరియు రైతులను నిర్వాసితులను చేస్తోంది. ఈ సమస్యలను లేవనెత్తడానికి అందరూ వీధుల్లోకి రావాలి." అని సీపీఐ నాయకుడు జనార్దన్ పాటి తెలిపారు.



# ఇంద్రేశంలో భారీ అగ్నిప్రమాదం

## -ప్లాస్టిక్ గోదాంలో మంటలు

**టీ మీడియా ఫిబ్రవరి 11, సంగారెడ్డి :**జిల్లా ఇంద్రేశంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రమాదం జరిగింది. భారీగా మంటలు ఎగసిపడుతున్న క్రమంలో దట్టమైన పొగ కమ్మేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు స్థానికులు. ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.ఇంద్రేశం మున్సిపాలిటీలో ఎన్నికలు జరుగుతున్న క్రమంలో గోదాంలో సిబ్బంది ఎవరు లేరని తెలుస్తోంది. ఈ ఘటనలో ప్రాణనష్టం ఏమీ సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.